# దశ

నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM

బుధవారం 13 08 2025

సంపుటి 1 సంచిక 105

పేజీలు : 02

UDYAM / TS-09-0148996


## చరిత్రలో ఈ రోజు



1976: ప్రపంచ ఎడమచేతి వాటం ప్రజల దినోత్సవం
1910: ప్రముఖ సమాజ సేవకురాలు ఫ్లోరెన్స్ నైటింగేల్ మరణం
1932: భారత దేశానికి చెందిన ఆర్థిక వేత్త సి.రంగరాజన్ జననం.
1936: తెలుగు, తమిళ సినిమా నటి వైజయంతిమాల జననం.
1961: ప్రసిద్ధి చెందిన బెర్లిన్ గోడ ప్రారంభించారు.
1963: భారతీయ సినిమా నటి శ్రీదేవి జననం (చిత్రంలో)
1994: తెలుగు నటుడు రావు గోపాలరావు మరణం
2004: స్వేచ్ఛా నకలు హక్కులతో సమిష్టిగా తయారు చేయగల పుస్తకాల జాల స్థలి వికీబుక్స్ ప్రారంభం




# రెయిన్ అలర్ట్


**భారీ వర్షా లు కురుస్తాయన్న నేపథ్యంలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సెలవులను రద్దు**

**మా శాఖకు సంబంధం లేదని ఏ విభాగం చెప్పడానికి వీలులేదు.. అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో సీఎం రేవంత్ రెడ్డి**

**దశ, రంగారెడ్డి :** రానున్న మూడు రోజులు తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో అధికార యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్‌తో పాటు భారీ వర్షాలు, వరద ప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల్లో ఆస్తి, ప్రాణ నష్టం జరక్కుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులు, జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. రానున్న 72 గంటల్లో పలు జిల్లాలతో పాటు హైదరాబాద్‌లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ముఖ్యమంత్రి గారు ఉన్నతాధికారులు, జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అప్రమత్తం చేశారు. రానున్న పరిస్థితులను ఎదుర్కొనడానికి తీసుకోవలసిన చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రాబోయే మూడు రోజులు కీలకంగా మారినందున అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సెలవులను రద్దు చేయాలి. 24 గంటలు అందుబాటులో ఉండాలి.ఎక్కడా ప్రాణ,ఆస్తినష్టం జరకుండా,పశుసంపదకు నష్టం జరక్కుండా చర్యలు తీసుకోవాలి. హైదరాబాద్, రంగారెడ్డి లాంటి ప్రాంతాల్లో ఐటీ సంస్థలు వర్క్ ఫ్రమ్ హోం నిర్వహించుకునేలా ఆయా సంస్థలతో ఐటీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సమన్వయం చేయాలన్నారు. మా శాఖకు సంబంధం లేదని ఏ విభాగం చెప్పడానికి వీలులేదు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి. వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి , తుమ్మల నాగేశ్వర రావు , పొన్నం ప్రభాకర్ , ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు , డీజీపీ జితేందర్ తో పాటు ఆయా శాఖల ఉన్నతాధికారులు, జిల్లాల నుంచి కలెక్టర్లు పాల్గొన్నారు.









## రెడ్ అలెర్ట్ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

**అధికారులకు జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశం**



**దశ, రంగారెడ్డి :** నిరంతర వర్షాల దృష్ట్యా రానున్న రెండు రోజుల్లో జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ ప్రకటించినందు వల్ల అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా అధికారులతో కలిసి భారీ వర్షాలు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, వన మహోత్సవం, ఇందిరమ్మ ఇండ్లపై ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెడ్ అలెర్ట్ ప్రకటించినందున ఆయా మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు తమ యాక్షన్ టీంలకు సంబంధించి ఫీల్డ్ ఆఫీసర్లు, సిబ్బందిని అప్రమత్తంగా ఉంచాలని, తప్పనిసరిగా కంట్రోల్ రూమ్లను ఏర్పాటు చేసుకుని 24/7 అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అన్నారు. విద్యుత్, రెవెన్యూ, పోలీసు, ఆర్అండ్ బీ, పంచాయితీరాజ్, ఇరిగేషన్ శాఖలను సమన్వయం చేసుకుని ప్రమాదకరంగా ఉండే నాలాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా భారీ వర్షాల వల్ల జిల్లాలో ఎలాంటి ప్రాణ నష్టం (మనుషులు/ జంతువులు) జరగకుండా చూడాలని కలెక్టర్ సూచించారు. వరదలు, ప్రమాదాలు సంభవిస్తే అత్యవసర పరిస్థితుల్లో కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్ 7993103347, 040 23237416 కు సమాచారం అందించాలని, కంట్రోల్ రూం 24 గంటకు పనిచేస్తుందని కలెక్టర్ వివరించారు. వీడియో కాన్ఫరెన్స్లో డీఆర్ఓ సంగీత, డీఆర్డీఓ పీడీ శ్రీలత, డీపీఓ సురేష్ మోహన్, వ్యవసాయ శాఖ అధికారి ఉష, హౌసింగ్ పీడీ నాయక్, డీఈఓ సుశీందర్రావు, ఎస్సీ సంక్షేమ అధికారి రామారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండండి: తేజస్ నంద లాల్

**దశ తుంగతుర్తి :** అధిక వర్షం కారణంగా తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా సంబంధిత శాఖలు సహాయక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. సోమవారం రాత్రి తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో 180 మిమిల ఆకస్మిక వర్షం కురవటం వల్ల గ్రామంలోని వరద ప్రభావిత లోతట్టు ప్రాంతమైన 12 వ వార్డులో జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా వలిగొండతొర్రూరు జాతీయ రహదారి (193) తొండ గ్రామం వద్ద కమ్మంకుంట చెరువు కి వరద నీరు వెళ్లేందుకు కడుతున్న బ్రిడ్జి పనులను కలెక్టర్ పరిశీలించారు. వరద నీరు చెరువులోకి వెళ్లేలా ఎక్కువ మిషనరిని ఉపయోగించి అడ్డంకులను తొలగించాలని, అలాగే సర్వీస్ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని జాతీయ రహదారి అధికారులను ఆదేశించారు. తిరిగి వర్షాలు వస్తే వరద ప్రభావిత ముంపు ప్రాంతాల ప్రజలకు సహాయక శిబిరాన్ని ఏర్పాటు చేయాలని తహసీల్దార్ ని ఆదేశించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ హరి ప్రసాద్, ఎంపిడిఓ లాజర్, డిప్యూటీ తహసీల్దార్ జాన్ మహ్మద్, తదితరులు ఉన్నారు.



## పార్లమెంట్ లో కాంగ్రెస్ ఎంపీల వినూత్న ప్రదర్శన

**దశ, న్యూఢిల్లీ:** పార్లమెంట్ లో మంగళవారం నాడు కాంగ్రెస్ ఎంపిలు వినూత్న ప్రదర్శనకు దిగారు. మింతాదేవి బొమ్మతో కూడిన టీ షర్టు ధరించి ప్రదర్శ న చేసారు. మింతాదేవి మొట్టమొదటి ఓటరుగా నమోదు చేసుకున్న మహిళ. ఆమె వయసు 124 సంవత్సరాలు. 124 నాట్ అవుట్ అన్న నినాదాన్ని టీ షర్ట్ పై రాసుకుని ఎంపీల ప్రదర్శన కొనసాగింది. ఎన్నికల కమిషన్ తప్పిదాలను వెలికి తీసేందుకు చేస్తున్న ప్రయత్నంలో భాగంగా ప్రదర్శన జరిగింది.



## రామచంద్రారావు హౌస్ అరెస్టు

**దశ, నాచారం:** పెద్దమ్మ టెంపుల్ వద్ద అక్కడి ప్రజలు కుంకుమార్చన చేస్తే బిజెపి రాష్ట్ర అధ్యక్షునిగా నన్ను హౌస్ అరెస్టు చేయడం ఏంటి దీన్ని భారతీయ జనతా పార్టీ గా, హిందువులుగా పూర్తిగా ఖండిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు.మంగళవారం తెల్లవారు జామున ఓయూ పోలీసులు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ను తార్నాక లోని ఆయన నివాసం లో హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ నాతో పాటు కొంతమంది బిజెపి కార్పొరేటర్ల ను,నాయకులను అరెస్టు చేశారు. బంజారాహిల్స్ లో ఎవరో సంస్థ బిజెపికి సంబంధం లేకుండా హిందూ కార్యక్రమాలు, పూజలు చేస్తుంటే బిజెపి నాయకులను అరెస్టు చేయడాన్ని బీజేపీ పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది.

## సిట్ కు సృష్టి కేసు

**దశ, సికింద్రాబాద్:** సికింద్రాబాద్ సృష్టి కేసును సిట్ కు బదిలీ చేశాం. జులై లో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించాం. మొదటగా 8 మందిని తర్వాత 16 మందిని అరెస్ట్ చేశామని నార్త్ జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్ అన్నారు. రెండో కేసులో చనిపోయిన బేబీ నీ చూపించి డబ్బులు వసూలు చేశారు. 10 నుండి 20 లక్షల వరకు డబ్బులు బాధితుల నుండి తీసుకున్నారు. నలుగురు వైద్యులు,మిగిలిన ఏజెంట్లను అరెస్టు చేశామం. విశాఖ లో బేబీ డెలివరీకి ఇచ్చారు. నమ్రత బ్యాంక్ ఖాతాలను నిలుపుదల చేశామని అన్నారు.

## నల్లగొండలో ముగ్గురికి ఇస్తే తప్పేంటి?: రాజగోపాల్ రెడ్డి

**దశ, హైదరాబాద్:** మరోసారి మంత్రి పదవిపై మునుగోడు ఎంఎల్ఎ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఖమ్మం జిల్లాలో తొమ్మిది మంది ఎంఎల్ఎలు ఉంటే మూడు మంత్రి పదవులు ఇచ్చారని, నల్లగొండలో 11 మంది ఎంఎల్ఎలు ఉంటే మూడు మంత్రి పదవులు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. లోక్ సభ ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికలప్పుడు మంత్రి పదవి ఇస్తామని మాట ఇచ్చారని, ఇప్పుడు మాట తప్పితే ఎలా అని కోమటిరెడ్డి అడిగారు.



## 'విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి'

ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మంగళవారం జిల్లాలోని జన్నారం మండల కేంద్రంలో గల ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల, కవ్వాల్ లోని ప్రభుత్వ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలను మండల తహసిల్దార్ రాజ మనోహర్ రెడ్డి తో కలిసి సందర్శించి తరగతి గదులు, విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, హాజరు పట్టికలు, మూత్రశాలలు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు.

దశ ,మంచిరర్యాల

## పట్టపగలే ఖజానా లో కాల్పులు...

**దశ, హైదరాబాద్:** హైదరాబాద్‌లోని చందానగర్‌లో ఖజానా జ్యువెలర్స్ షోరూంలో దోపిడీ కలకలం రేపింది. ముసుగు ధరించిన దుండగులు సిబ్బందిపై కాల్పులు జరిపి.. వెండి నగలు దోచుకెళ్లారు. కాల్పుల్లో షోరూం డిప్యూటీ మేనేజర్ తీవ్రంగా గాయపడ్డారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు, నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.హైదరాబాద్ చందానగర్‌లో ఉన్న ఖజానా జ్యువెలర్స్ షోరూంలో కాల్పులు కలకలం రేపాయి. ఇవాళ ఉదయం జ్యువెలర్స్ సిబ్బందిపై దుండగులు కాల్పులకు తెగబడ్డారు. ముసుగు ధరించిన ఆరుగురు దుండగులు షాప్ తెరిచిన వెంటనే లోపలికి చొరబడ్డారు. దోపిడీని అడ్డుకోవడానికి ప్రయత్నించిన డిప్యూటీ మేనేజర్ కాళ్లపై రెండు రౌండ్లు కాల్పులు జరిపి గాయపరిచారు. అనంతరం షోరూంలోని వెండి సామాగ్రి, నగలు దోచుకున్నారు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు. మిగతా సిబ్బంది గాయపడిన వారిని వెంటనే ఆసపత్రికి తరలించారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించి పోలీసులు ఆధారాలు సేకరించారు. కాల్పులు జరిపి దుండగులు జహీరాబాద్ వైపు పారిపోయినట్లు పోలీసులు తెలిపారు. దోపిడీదారులు కేవలం 1 కేజీ వెండిని మాత్రమే తీసుకెళ్లినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఈ ఘటనపై సైబరాబాద్ పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. 10 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




## జిల్లాలో పొలాలు ఎండుతున్నాయి

**వందలాది టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నా మంత్రులకు సోయి లేదు :మాజీ మంత్రి జగదీష్ రెడ్డి**

**దశ, నల్గొండ:** నాగార్జునసాగర్ నుంచి వందల టీఎంసిల నీరు సముద్రంలో కలుస్తున్నా జిల్లాలో సాగు నీరు లేక పంటలు ఎండిపోతున్నాయని మాజీ మంత్రి జగదీష్ రెడ్డి విమర్శించారు. ఏఎంఆర్పీ కాలువ కింద చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందడం లేదు. జిల్లా మంత్రులకు చిత్తశుద్ధి లేదు. ఏపీ కి నీళ్లు వదిలేంత ఆతృత, జిల్లాలో రైతులకు నీళ్లు ఇవ్వాలనే తపన లేదని అన్నారు. మా పాలనలో వరుసగా 8 ఏళ్లు చెరువులు నిండుగా ఉంచి... ప్రతి ఎకరాకు సాగునీరు ఇచ్చాం. ఏఎంఆర్పీ లిఫ్ట్ కింద డి25, డి26, డి29, డి31, డి39, డి0 డిస్ట్రిబ్యూటరీల కింద 70 వేల ఎకరాలకు నీళ్లు అందించిన ఘనత బీఆర్ఎస్ దే. కోమటిరెడ్డి మంత్రి అయిన తర్వాత మళ్లీ పొలాలు ఎండిపోతున్నాయి. హెలికాప్టర్ల ఆర్భాటాలు, కమిషన్ దందాలు తప్ప రైతుల పట్ల ప్రేమ లేదని అన్నారు. కోమటిరెడ్డి - ఉత్తమ్ ఇద్దరూ అసమర్థులే. కృష్ణ జలకళ ఉన్నా, జిల్లాలో చెరువులు ఎండిపోయి కనిపిస్తున్నాయి, కోమటిరెడ్డి క్షుద్రపూజలు అని పిచ్చిపిచ్చి వ్యాఖ్యలు చేస్తున్నారు. కోమటిరెడ్డి కి మంత్రి పదవికి అర్హత లేదని అన్నారు.





## మూసి నదిని పరిశీలించిన జిల్లా ఎస్పీ నరసింహ

**దశ, సూర్యాపేట ప్రతినిధి:** మూసి నదిలో వరద ఉధృతి దృష్ట్యా జిల్లా ఎస్పీ నర్సింహా ఐపీఎస్ మంగళవారం సూర్యాపేట రూరల్ పరిధి ఎదురువారిగూడెం - బీమారం వంతెన వద్ద మూసి నది ప్రవాహాన్ని సంభందించి సి ఐ రాజశేఖర్, ఎస్ ఐ బాలు నాయక్, మూసి అధికారులతో కలిసి పరిశీలించారు. వర్షాల దృష్ట్యా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, మూసి ప్రాజెక్ట్ అధికారులతో సమన్వయంగా పని చేయాలని అన్నారు. పరిస్థితులు అంచనా వేస్తూ మూసి పరివాహక గ్రామాల ప్రజలను జాగ్రత్త పరచాలని ఆదేశించారు. వర్షాల దృష్ట్యా జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ కోరారు. అత్యవసర సమయాల్లో డయల్ 100 కు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ కంట్రోల్ 8712686026 ఫోన్ చేసి పోలీసు సేవలు పొందాలని తెలిపారు.

# అశ్లీల విషయాలపై యువత దూరంగా ఉండాలి

- మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి
- చిన్నారుల అశ్లీల వీడియోల కేసులో ఇద్దరి అరెస్ట్



**దశ, మంచిర్యాల / మందమర్రి :** అశ్లీల విషయాలపై యువత దూరంగా ఉండాలని, చిన్నారులకు సంబంధించిన అశ్లీల వీడియోలను సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లైన ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లలో షేర్ చేసిన కేసులో పట్టణానికి చెందిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి తెలిపారు. మంగళవారం సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అశ్లీల విషయాల పై యువత దూరంగా ఉండాలని ఇటువంటి చర్యలపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ వింగ్ నిఘా ఉంచి, కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. జాతీయ సంస్థ నేషనల్ సెంటర్ ఫర్ మిస్సింగ్ అండ్ ఎక్స్‌ప్లోయిటెడ్ చిల్డ్రన్ అందించిన సమాచారం ఆధారంగా, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ వింగ్ ఈ కేసును మందమర్రి పోలీసులకు అప్పగించిందని, దీనిపై స్పందించి సైబర్ చట్టం కింద రెండు కేసులు నమోదు చేశామని తెలిపారు. ఇంటర్‌నెట్‌లో చిన్నారుల అశ్లీలతను వెతకడం, షేర్ చేయడం, ఫార్వర్డ్ చేయడం లేదా ప్రచారం చేయడం అత్యంత తీవ్రమైన నేరాలని, ఇటువంటి చర్యలకు పాల్పడిన ప్రతి ఒక్కరిపైనా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ వింగ్ సైబర్ పెట్రోలింగ్ ద్వారా నిఘా ఉంచి, చట్టపరమైన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. సమాజంలో చిన్నారుల రక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, సామాజిక మాధ్యమాల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎస్సై రాజశేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆడపడుచులకు ఎప్పుడు అండగా ఉంటా

- తాజా మాజీ కౌన్సిలర్ గ్యారల శ్రీనివాస్‌గౌడ్



**దశ, పెద్ద అంబర్ పేట:** ఆడపడుచులకు ఎప్పుడు అండగా ఉంటానని తాజా మాజీ కౌన్సిలర్ గ్యారల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధి 1వ వార్డు రాజీవ్ గృహకల్ప కాలనీలో నివాసించే తాడూరి పుష్పలీల-అంజయ్యల కుమార్తె వివాహానికి రూ. 10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా గ్యారల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ఆడపడుచులకు ఓ అన్నగా ఎప్పుడు అండగా ఉంటానిని అన్నారు. సమాజంలో ఎవ్వరికైనా.. ఏ అవసరం ఉన్నా.. ఎల్లప్పుడు తోడుగా ఉంటానన్నారు. ఎలాంటి సహాయం చేయడానికైనా తాను సిద్ధమేనని అన్నారు. ఆడబిడ్డ పెళ్లి ఆర్థిక సహాయం అందజేడంపై కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ..కష్టకాలంలో తోడ్పాటు అందించిన మాజీ కౌన్సిలర్ గ్యారల శ్రీనివాస్‌గౌడ్‌కు పుష్పలీల-అంజయ్యలు కృతజ్ఞతలు తెలిపారు.

## జూపాక పీఏసీఎస్ వద్ద యూరియా కోసం రైతుల ఇబ్బందులు



**దశ, హుజూరాబాద్:** జూపాక పీఏసీఎస్ వద్ద యూరియా ఎరువుల కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంటలకు అత్యవసరమైన యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మంగళ వారం ఉదయం నుంచి రైతులు పెద్ద సంఖ్యలో యూరియా కోసం పీఏసీఎస్ కార్యాలయం వద్ద బారులు తీరారు. ఈ పరిస్థితిపై ప్రభుత్వం, వ్యవసాయ అధికారులు తక్షణమే స్పందించి, జూపాక పీఏసీఎస్‌కు అవసరమైన యూరియా స్టాక్‌ను పంపించాలని రైతులు విజ్ఞప్తి చేశారు. పంట సీజన్‌లో తమ ఇబ్బందులను తొలగించడానికి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## అపూర్వ బదిరుల పాఠశాలకు 45 కుర్చీలు బహుకరణ



**దశ, సూర్యాపేట ప్రతినిధి:** సూర్యాపేట మండలంలోని కేసారం (కాసరాబాద్ రోడ్డు ) అపూర్వ బదిరుల పాఠశాలకు మంగళవారం బడుగుల అక్షయ పుట్టినరోజు సందర్భంగా 45 కుర్చీలు కేతేపల్లి మాజీ ఎంపీపీ బడుగుల శ్రీనివాస్ యాదవ్, పద్మ దంపతులు అందజేశారు. ఈ సందర్భంగా బడుగుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. తన కూతురు జన్మదిన వేడుకలు బదిరుల విద్యార్థుల జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కారస్పాండంట్ మదనాచారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.





## దేశం గర్వించదగ్గ గొప్ప వ్యక్తి సీతారాం ఏచూరి

- జయంతి సభలో ములకలపల్లి రాములు

**దశ, సూర్యాపేట ప్రతినిధి :** మార్క్సిస్టు మేధావి బహుముఖ ప్రజ్ఞశాలి సిపిఎం అఖిల భారత మాజీ ప్రధాన కార్యదర్శి మాజీ రాజ్యసభ సభ్యులు కామ్రేడ్ సీతారాం ఏచూరి దేశం గర్వించదగ్గ గొప్ప వ్యక్తిని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ములకలపల్లి రాములు అన్నారు మంగళవారం సీతారాం ఏచూరి జయంతి సందర్భంగా స్థానిక సిపిఎం జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ లౌకిక విలువల కోసం ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం దేశ ఐక్యత కోసం నిరంతరం పరితపించిన గొప్ప నాయకుడు అని ఆయన కొనియాడారు కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట గోపి జిల్లా కమిటీ సభ్యులు తెలుగూరి గోవిందు మేకనబోయిన శేఖర్ వేల్పుల వెంకన్న జిల్లేపల్లి నరసింహారావు, వీరబోయిన రవి, సిఐటియు జిల్లా అధ్యక్షులు రాంబాబు, మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్గూరి జ్యోతి, పిండిగ నాగమణి తదితరులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

# ఎల్బీనగర్ లో విద్యార్థుల ఘర్షణ

- అందరూ అవినాష్ కాలేజ్ విద్యార్థులే



**దశ, ఎల్బీనగర్:** వారంతా విద్యార్థులు... చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకుని దేశాభివృద్ధికి కృషి చేయాల్సినవారు. కానీ, గ్రూపులుగా ఏర్పడి వీధి రౌడీలుగా మారి తన్నుకుంటున్నారు. దాడి చేసుకున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డ్ అయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు ఎల్బీనగర్ పోలీసులు 15 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. ఎల్బీనగర్ లోని అవినాష్ కళాశాలలో జె.ధీరజ్(17) డిగ్రీ ఫస్టియర్ చదువుతున్నాడు.

ఈ నెల 1వ తేదీన సాయంత్రం అదే కళాశాలలో చదువుతున్న అక్షయ్ తో ధీరజ్ మాట్లాడుతుండగా వాగ్వాదానికి దారి తీసింది. ఇదే విషయంపై డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న వంశీ తన స్నేహితులతో కలిసి ధీరజ్ ను బెదిరించారు. దీనిపై 2వ తేదీన ప్రిన్సిపాల్ కు ఫిర్యాదు చేయాలని ధీరజ్ తన స్నేహితులు ఎ.మహేశ్, వి.సాయిచరణ్ తో కలిసి కళాశాలకు వస్తున్నారు. విషయం తెలుసుకున్న ఫైనలియర్ విద్యార్థులు కళాశాల సమీపంలోని భారత్ పెట్రోల్ బంక్ వద్ద ధీరజ్ తోపాటు అతడి స్నేహితులను అడ్డుకుని విచక్షణా రహితంగా దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ధీరజ్, మహేశ్, సాయిచరణ్ తీవ్రంగా గాయపడ్డారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుల బంధువులు, కుటుంబ సభ్యులు మంగళవారం ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ దాడిలో మొత్తం 15 మందిపై 115(2),118(1),126(2) 351(2) r/w 3(5) BNS యాక్ట్ కేసు నమోదు చేసినట్లు ఎల్బీనగర్ పోలీసులు తెలిపారు.

## యువకులకు నిరుద్యోగ భృతిని వెంటనే ఇవ్వాలి: దోసపాటి నరేష్



**దశ, మోతె :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలలో భాగమైన నిరుద్యోగ భృతి హామీని వెంటనే అమలు చేసి నిరుద్యోగులను ఆదుకోవాలని బి ఆర్ ఎస్ వి మోతే మండల అధ్యక్షులు దోసపాటి నరేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నిరుద్యోగ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గాంధీభవన్ ముట్టడికి పిలుపునివ్వడంతో సూర్యాపేట జిల్లా మోతే మండల కేంద్రంలో ఉన్న నిరుద్యోగులను ముందస్తుగా పోలీసులు అరెస్టు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నిరుద్యోగులు తురక వీరస్వామి, నాని, బాబు, కిరణ్, తరుణ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.



## హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీ

**దశ, శాలిగౌరారం:** స్వాతంత్ర్యం వచ్చి 79 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, పార్టీ ఆదేశాల మేరకు మంగళవారం హర్ ఘర్ తిరంగా యాత్రను ఘనంగా నిర్వహించారు. పహల్గాం దాడికి ప్రతీకార చర్యగా ఆపరేషన్ సింధూరులో మన సైనికులు సాధించిన విజయాన్ని స్మరించుకుంటూ, వారికి కృతజ్ఞతలు తెలుపుతూ తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కడియం రామచంద్రయ్య జాతీయ జెండాలతో బైక్ ర్యాలీనీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా కౌన్సిల్ సభ్యుడు జమ్ము రమేష్, మండల పార్టీ అధ్యక్షుడు తోట వినోద్, ప్రధాన కార్యదర్శులు భాష బోయిన వెంకన్న, చాడ శ్యామ్ సుందర్ రెడ్డి, మైనార్టీ జిల్లా నాయకులు ఎస్కే సయ్యద్, మండల నాయకులు కొండ్రెడ్డి వేణుగోపాల్ రెడ్డి, మేడిపల్లి పాండురంగయ్య, బండారు లక్ష్మయ్య, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు

## గ్రంథాలయంలో ఘనంగా డా.ఎస్.ఆర్.రంగనాథన్ జయంతి వేడుకలు



**దశ, హుజురాబాద్:** భారత గ్రంథాలయ పితామహుడు డా. ఎస్.ఆర్.రంగనాథన్ 134వ జయంతి సందర్భంగా హుజురాబాద్ పట్టణంలోని గ్రంథాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. గ్రంథాలయ పరిపాలనాధికారి కె.కనకలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు చందుపట్ల జనార్దన్ మరియు అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. తడికమళ్ళ శేఖర్ మాట్లాడుతూ, తమిళనాడులో జన్మించిన రంగనాథన్ ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి పొందారని, గ్రంథాలయాల అభివృద్ధికి నిరంతరం కృషి చేసి పద్మశ్రీ అవార్డు పొందారని కొనియాడారు. ఈ సందర్భంగా ఉత్తమ లైబ్రేరియన్ అవార్డు పొందిన స్థానిక గ్రంథాలయ అధికారి కె.కనకలక్ష్మిని అతిథులు అభినందించారు. ఈ కార్యక్రమంలో వేల్పుల రత్నం, మహ్మద్ ఖలీక్ సంద్యేల వెంకన్న, కొంపెల్లి సంజీవ్,రిటైర్డ్ టీచర్ తిరుణహరి రమేష్ , తాళ్లపల్లి అమరేందర్ గౌడ్, పాత్రికేయులు కిరణ్ కుమార్, మరియు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## డయాలసిస్ పేషెంట్ కి అండగా నిలిచిన పిట్టల నాగరాజు



**దశ, మేడ్చల్ మల్కాజిగిరి:** మల్కాజిగిరి నియోజకవర్గం పరిధిలో వినయ్ నగర్ 137 డివిజన్ లో వాచ్ పై నగర్ లో నివాసం ఉంటున్న జ్యోతి అనే నిరుపేద వృద్ధురాలికి రెండు కిడ్నీలు పాడైపోవడంతో డయాలసిస్ కొరకు నిమిత్యం ఖర్చులకు మైనంపల్లి హనుమంతరావు చేతుల మీదుగా 10000 ఆర్థిక సాయం చెయ్యడం జరిగింది. ఈ సందర్భంగా పిట్టల నాగరాజు మాట్లాడుతూ జ్యోతి ఆయురారోగ్యాలతో ఉండాలని ఆశిస్తూ తనకెప్పుడూ భగవంతుడు ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నాను. రానున్న రోజుల్లో ప్రజా సమస్యలపై ప్రత్యేకంగా పోరాడే అవకాశాన్ని ప్రజలు కల్పిస్తారని ఆశిస్తూ అలాగే మైనంపల్లి హనుమంతరావు స్ఫూర్తితో మరో ఎన్నో సేవలు చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పిఎన్ఆర్ గ్రూప్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు



## టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కు స్వాగతం

- పలికిన పేట కాంగ్రెస్ నాయకులు

**దశ సూర్యాపేట ప్రతినిధి:** టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కు పట్టణ పార్టీ అధ్యక్షులు ఎండి అంజద్ అలీ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. మంగళవారం హైదరాబాదు నుండి విజయవాడ వెళ్తూ జిల్లా కేంద్రంలోని హోటల్ సెవెన్ లో కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్క కార్యకర్త సైనికుని వలె పని చేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం ఆహర్నిశలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు ఆలేటి మాణిక్యం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పందిరి మల్లేష్ గౌడ్, నాగుల వాసు, జావిద్ బేగ్, చెంచల నిఖిల్, బొజ్జ సంజయ్, భూక్య శివ, మధు, నవీన్, రవి తదితరులు ఉన్నారు.



## అగ్రికల్చరల్ ట్రేడర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

- అభినందించిన వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి

**దశ, సూర్యాపేట ప్రతినిధి:** సూర్యాపేట అగ్రికల్చరల్ ట్రేడర్స్ అసోసియేషన్ నూతన కమిటీని వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అభినందించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ లో గల అగ్రికల్చరల్ ట్రేడర్స్ కార్యాలయంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అగ్రికల్చర్ ట్రేడర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా చల్లా సత్యనారాయణ, ఒకటవ ఉపాధ్యక్షులుగా ముప్పారపు నాగేశ్వరరావు, రెండవ ఉపాధ్యక్షులుగా మాడుగుల నవీన్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా దేవీ రెడ్డి జానకి రామ్ రెడ్డి, సహాయ కార్యదర్శిగా కందిమల్ల సత్యనారాయణ, కోశాధికారిగా పాలవరపు శ్రీనివాసు లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి షషియోద్దిన ఉన్నారు.

## ఘనంగా జాతీయ గ్రంథ పాలకుల దినోత్సవం



**దశ, హయత్ నగర్ :** ప్రభుత్వ డిగ్రీ కళాశాల హయత్ నగర్ లో మంగళవారం డాక్టర్ ఎస్ ఆర్ రంగనాథన్ జయంతిని సందర్భంగా కళాశాల గ్రంధాలయ విభాగం ఆధ్వర్యంలో జాతీయ గ్రంథపాలకుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సురేష్ బాబు గారు హాజరై మాట్లాడుతూ డాక్టర్.రంగనాథన్ సేవలు గ్రంథాలయ అభివృద్ధితో పాటు, గ్రంథాలయ సమాచార శాస్త్రాన్ని భారతదేశంలో వివిధ యూనివర్సిటీలలో అభివృద్ధి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు డాక్టర్ ఏ దుర్గాప్రసాద్, కళాశాల అధ్యాపకులు డాక్టర్.యాదగిరి రెడ్డి, డాక్టర్ మక్ల, డాక్టర్.వెంకటేశ్వర్లు, డాక్టర్.అపర్ణ చతుర్వేది, డాక్టర్ శారద, డాక్టర్ నాగరాజు, డాక్టర్. అనిత, డాక్టర్.బాల నరసింహా, డాక్టర్.శేఖర్, శ్రీ. మల్లేశం, డాక్టర్.యాదయ్య , రజిత , గ్రంథాలయ సిబ్బంది ఉదయ్ నాయక్, విద్యార్థులు పాఠకులు పాల్గొన్నారు.

## చెక్ డ్యామ్ సందర్శించిన ఎమ్మెల్యే సామేలు



**దశ, అడ్డగూడూర్:** యాదాద్రి భువనగిరి జిల్లా, అడ్డగూడూరు మండలం, ధర్మారం గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం కాలంలో నిర్మించిన చెక్ డ్యామ్ ను మంగళవారం తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు సందర్శించారు. బిక్కిరివాగు నుండి చేరిన జలాలు చెక్ డ్యామ్ పైగా ఉప్పొంగుతూ అలలతో అందాలు చిందిస్తున్న దృశ్యాన్ని ఆస్వాదించిన ఎమ్మెల్యే పంటలకు, రైతులకు ఇవి వరప్రసాదం లాంటివని పేర్కొన్నారు. నీటి నిల్వలు సమృద్ధిగా ఉండటం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.